

ఆఫీసు వదిలేసరికి ఆరయిపోయింది.

యూనియన్ మీటింగ్ అయింతర్వాత రాత్రి పది గంటలకు ఇల్లు చేరుకున్నాను. నా కోసం మా శ్రీమతి పడిగాపులు కాస్తూ కూర్చుంది.

స్నానం చేసి భోజనం దగ్గర కూర్చున్నాను.

"ఇంత ఆలస్య మయిందేం?" శ్రీమతి అడిగింది.

"యూనియన్ అధ్యక్షుడ్ని కదా మీటింగు చూసుకొస్తున్నాను."

"వేగంగా వచ్చుంటే బావుండేది."

"ఏం?"

"బాబూరావు–వాళ్ళమ్మగారూ మీకోసం ఎదురుచూసి– చూసి వెళ్ళిపోయారు."

"ఎవరూ ?! ఆ కుర్రాడేనా?!"

"ఆ! పాపం! ఆ అబ్బాయి మనం ఏం పని చెప్పినా చేస్తుంటాడు. ఈ వీధిలో ఎవరు చెప్పినా కాదనకుండా పన్జేస్తాడు."

"వాళ్ళమ్మగారెందు కొచ్చారు.?"

"ఆ అబ్బాయికోసమే!"

"ఎందుకూ?"

"ఆ కుర్రాడికి ఎక్కడన్నా పని చూసి పుణ్యం కట్టుకోమని వేడుకుంది."

"అవునే! మా ఆఫీసులో బంట్రోతు ఉద్యోగం ఖాళీగా ఉంది. నాకూ ఆ ఉద్యోగాన్ని ఈ కుర్రాడికి ఇప్పిద్దామనే ఉంది రేపు ఉదయం ఆ కుర్రాడికి కబురు చెయ్యి మాట్లాడాలి."

"అలాగే!... అవునూ! మీరు కొత్త చెప్పులు కొన్నట్టున్నారే!"

"ఆ! బావున్నాయా!?"

"బావున్నాయి గాని ఎంతేవిటి?!"

"వందకి పాతిక తక్కువ!"

"అంటే – డబ్బుది అయిదా?!"

"ఏం? అంత ఖరీదు చెయ్యవా?!"

"ఎందుకు చెయ్యవు: కానీ, మీకు అంత ఖరీదు వెందుకండీ!"

"వేసుకుంటే తగనా?!"

"అన్నానా?!"

"ఆ మాటనక పోయినా అందులో గూడార్థం అదేకదా!"

"పోదురూ!.. ఆ అబ్బాయికి ఈ ఉద్యోగం ఎలాగైనా ఇప్పించండి పాపం! వాళ్ళు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు ఆవిడ సంపాదన మీద వాళ్ళిద్దరూ నెట్టుకు రావడం కష్టంగా ఉందట. ఈ రోజంతా తన కష్టాలు చెప్పుకు ఏడ్చిందావిడ." మా ఆవిడ సిఫార్సుకు అర్థం వుంది.

ఆ అబ్బాయి నాకు తెలుసు.

ఆ కుర్రాడికి తల్లి తప్ప 'నా' అనే వాళ్ళు ఇంకెవరూ లేరు. తల్లి అందరి ఇళ్ళల్లోనూ 'పాచి' పని చేస్తూంటుంది. ఈ కుర్రాడు వీధిలో ఎవరు ఏం చెప్పినా చేస్తుంటాడు వాళ్ళు సంతోషంతో ఇచ్చే పదీ– పరక పుచ్చుకుంటాడు.

నాకు అప్పుడప్పుడూ 'వైన్' తెచ్చి పెడుతుంటాడు. పోనీ, పాపం! అటువంటి కుర్రాడికి ఉపకారం చేస్తే మన పేరు చెప్పుకు బ్రతుకుతాడు.

ఉదయం లేస్తూనే 'టీ' త్రాగడం నాకలవాటు. ఉదయం ఆరవుతుండగానే నేను 'టీ' త్రాగుతున్నప్పుడా కుర్రాడొచ్చాడు. ఆ అబ్బాయికీ గ్లాసుతో 'టీ' తీసుకువచ్చి ఇచ్చింది మా ఆవిడ.

నా ముందర చేతులు నులుముకు నిలబడ్డాడు. నేనే 'టీ' పుచ్చుకోమని చెప్పాను. వేడిగా సెగలు కక్కుతున్నగ్లాసుడు 'టీ' ఒక్క గుక్కలో త్రాగేసి గ్లాసు క్రిందపెట్టి చేతులు కట్టుకు నిలబడ్డాడా కుర్రాడు.



"మా ఆఫీసులో బంట్రోతు ఉద్యోగం ఖాళీగా ఉంది. వేయిస్తాను చేస్తావా?"

"చేస్తానయ్యా!"

"ఏం చదువుకున్నావు."

"ఎనిమిదో తరగతి పాసై మానేశానయ్యా."

"ఎంప్లాయిమెంటు కార్డు తీసావా?!"

"తీసానయ్యా!"

"సాయంత్రం ఓ సారి ఇంటికి రా. అప్లికేషన్ ఫారం తీసుకొస్తాను."

"అలాగేనయ్యా!"

ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు. నేను 'టీ' త్రాగడం పూర్తిచేసి గ్లాసు క్రింద పెట్టాను.

ఆ కుర్రాడి వినయ, విధేయతలకు నాకు సంతోషం వేసింది. రోజూకంటే ఈ రోజు ఉద్యోగం ఇప్పిస్తాననేసరికి మరింత నమ్రతగా చేతులు కట్టుకు నిలబడ్డాడు.

ఇటువంటి కుర్రాడ్ని వేయించినా తనకి కీర్తి దక్కుతుంది. మంచి కుర్రాడ్ని తీసుకు వచ్చినందుకు అందరూ ప్రశంసిస్తారు కూడా.

ఆఫీసు టైం అయేసరికి గాబరాగా స్నానంచేసి బయల్దేరాను.

చెప్పుల స్టాండు దగ్గర కొచ్చేసరికి నాకు మతి పోయింది. నిన్ననే- కొన్న కొత్త చెప్పుల జత కనిపించలేదు. ఆఫీసుకు టైం అవుతోందన్న భావన నాలోని కోపాన్ని రగిలిస్తోంది.

వాచీ చూసుకున్నాను.

టైం అయిపోతోంది. గాబరా నన్ను నంజుకుంటోంది.

"ఏవేయ్! ఇక్కడ నా కొత్త చెప్పులుండాలి. ఏవీ?"

"చూడండి. అక్కడే ఉంటాయి. ఇల్లు ఊడ్చేటప్పుడు చూసాను."

"లేవు"

"సరిగా చూడండి?!"

"నువ్వే వచ్చి చూడు. నాకేం చత్వారమనుకున్నావా?!"

"మీరిప్పుడా కుర్రాడితో మాట్లాడుతున్నప్పుడు అవ్వి అక్కడే ఉన్నాయి గదండీ. ఈ క్షణానికే ఎటు మాయం అయిపోతాయ్!"

"ఆ!"

నా గొంతులో తడారిపోయింది.

ఆ అబ్బాయి ఉన్నప్పుడు ఉన్నవి– ఇప్పుడెక్కడికి వెళ్తాయి?

నా తలగిర్రున తిరిగింది.

"ఏమేవ్! ఆ కుర్రాడు మళ్ళావస్తే మరిక మనింటి ఛాయలకు రావద్దని చెప్పి పంపించెయ్."

చెప్పుల్లేకుండా – కాళ్ళీడ్చుకుంటూ ఆఫీసుకు బయల్దేరాను. □

ఇందూ రమణ